సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం ౹ 15 ౹ అక్టోబర్ ౹ 2023



రూ. 210 కోట్లతో ఉపాధి

రాష్ట్రంలో రూ.210 కోట్లతో వ్యవసాయేతర రంగంలో జీవనోపాధుల కల్పనకు చర్యలు చేపట్టినట్లు అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్ తెలిపారు. -10లో



ఆంత్రాక్స్ లక్షణాలతో గొర్రెల మృతి

గంజికుంటవారిపల్లెలో ఆంత్రాక్స్ వ్యాధి లక్షణాలతో 13 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	375	450
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1339.210 కిలోలు

నమామి మాతా...నారాయణీ!

'అయిగిరి నందిని నందిత మేదిని విశ్వవినోదిని నందినుతే.. గిరివరవింధ్య శిరోధిని వాసిని విష్ణు విలాసిని జిష్ణునుతే...'' అంటూ భక్తులు వేడుకోగానే మొర ఆలకించి ఆదుకునే జగజ్జనని అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టణాలు, పల్లెలు ముస్తాబయ్యాయి. హిందువులు జరుపుకొనే ముఖ్యమైన పండగలలో దసరా ఒకటి. చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా జిల్లాలోని 500కు పైగా ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి 23వ తేదీ వరకు నవరాత్రుల్లో అమ్మవారిని అలంకరించి ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిట లాడనున్నాయి. ఇప్పటికే ఆలయ వీధులన్నీ విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి.

- ఆదివారం నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం
- 500కు పైగా ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబు
- ప్రొద్దుటూరులో భారీ పందిరి, సెట్టింగ్‌లు ఏర్పాటు



ప్రొద్దుటూరు కన్యకాపరమేశ్వరీ అమ్మవారిశాల వద్ద కలకత్తా కళాకారులు వేసిన పందిరి

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాలో ప్రధానంగా దసరా అంటేనే ప్రొద్దుటూరు గుర్తుకు వస్తుంది. ఇక్కడి ఉత్సవాల నిర్వహణ మైసూరు ఉత్సవాలను తలపిస్తుంది. ఆర్య వైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి కొలువుదీరిన ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఆలయంతోపాటు బద్వేలు, జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాల్లోని అమ్మవారిశాలల్లోనూ శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. నేతన్నలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చౌడేశ్వరీ మాతను ఆరాధించి పది రోజులపాటు పూజలు నిర్వహిస్తారు. గ్రామాలు, మండలాల స్థాయి నుంచి పట్టణాల వరకు గంగమ్మ, బాల పోలేరమ్మ, సుంకులమ్మ తదితర గ్రామ దేవతల పేర్లతోగల ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలో శనివారం నాటికే నవరాత్రి శోభ సంతరించుకుంది. ఆలయ వీధులన్నీ రంగు రంగుల విద్యుద్దీపాలు, భారీ హోర్డింగ్‌లు, అమ్మవారి రూపాలతో అలంకరించారు. పెద్ద ఆలయాల వద్ద రాజ భవనాలను తలపించే ఆర్చీలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కొన్నిచోట్ల మట్టితో తయారు చేసిన అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాల అనంతరం సమీపంలోని కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు విద్యుత్తు, పారిశుధ్యం, పోలీసు, ఆరోగ్యశాఖలను పండుగకు సహకరించడంలో ముందుండాలని సూచించడంతో ఆయా శాఖల అధికారులు కార్యాచరణకు దిగారు.

పసిడి పురికి.. ఉత్సవ కళ



కదిలే ఆంజనేయస్వామి సెట్టింగ్

ప్రొద్దుటూరు కల్చరల్: మైసూరు తరువాత అంతటి ఖ్యాతి గడించిన పుత్తడిపురం ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు సిద్ధమైంది. ఆదివారం నుంచి 24వ తేదీ వరకు జరిగే దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ప్రొద్దుటూరు పట్టణంలోని ఆలయాలను కలకత్తా సెట్టింగ్, స్పెషల్ డెకరేషన్ సెట్టింగ్, పందిరి, రంగురంగుల ఎల్‌ఈడీ లైటింగ్ సిస్టం, భారీ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడంతో ఉత్సవ శోభ సంతరించుకుంది. వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో స్పెషల్ కలకత్తా పందిరి ఏర్పాటు చేశారు. పట్టణానికి చిహ్నమైన అమ్మవారిశాల గాలిగోపురాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బెంగళూరు, కలకత్తా, తమిళనాడు, పూనాకు చెందిన కళాకారులు మరింత శోభ చేకూర్చేలా అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయం నుంచి 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు ఆదివారం ఉదయం 7.20 గంటలకు వేద పఠనంతో నవగంగ తీర్థములను తెచ్చి పూజలు ప్రారంభించనున్నారు. అనంతరం అమ్మవారిశాల నుంచి మంగళ వాయిద్యాలతో బయల్దేరి తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వరస్వామి ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరీ దేవి పురాణాన్ని ఆర్య వైశ్యులు తీసుకురావడంతో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

నవరాత్రి శోభ



విజయదుర్గాదేవి ఆలయంలో ఆర్చి

కడప కల్చరల్: కడప నగరం నవరాత్రి శోభతో కళకళలాడుతోంది. అమ్మవారి ఆలయాలు గల వీధులన్నీ రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో వెలిగిపోతున్నాయి. ప్రధాన రోడ్లు కూడా కొద్ది మేరకు విద్యుత్ దీప శోభను సంతరించుకున్నాయి. బాల పోలేరమ్మ ఆలయం నుంచి అమ్మవారిశాల వరకు దాదాపు వంద మీటర్లు, గడ్డిబజారులో 150 మీటర్లకు పైగా, హనుమప్పవీధి తదితర వీధులు కూడా పూర్తిగా విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతున్నాయి. ఆయా ప్రాంతాలలో మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్న రోడ్డు పనులను ఉత్సవాల కోసం మున్సిపల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వందేళ్ల ఆలయంలో...



ముస్తాబైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని వాసవీ భవన్‌వీధిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం జిల్లాలోని అత్యంత పేరు ప్రఖ్యాతులు గాంచిన ఆలయాల్లో ఒకటి. ఇక్కడ ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయాన్ని 12 ఏళ్ల కిందట పునర్నిర్మించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. 15న మీనాక్షీదేవిగా అలంకరించి తొలి రోజున పూజ చేస్తారు. 16న వాసవాంబగా, 17న గాయిత్రీదేవిగా, 18న అన్నపూర్ణాదేవిగా, 19న శ్రీ కాళింగమర్ధినిగా, 20న సరస్వతిగా, 21న రాజరాజేశ్వరిగా, 22న మహిషాసురమర్ధినిగా, 23న ధనలక్ష్మీదేవిగా అలంకరిస్తారు. 24న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

23న గుండ ప్రవేశం



గర్భగుడిలో కొలువైన అమ్మవారు

రాజంపేట టౌన్: రాజంపేట కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారిశాల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భారీ సెట్టింగ్‌లతో అలంకరించారు. ప్రధాన కూడలిలో విద్యుత్తు దీపాలతో దేవతా మూర్తుల ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఆదివారం తొలిరోజున కన్యకా పరమేశ్వరీ అమ్మవారు దీక్షా బంధన దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 16న బిల్వవృక్ష నివాసినీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న కృష్ణమూర్తి, 19న మోహినీదేవి, 20న సరస్వతీదేవి, 21న మీనాక్షి దేవి, 22న మహిషాసురమర్దిని, 23న మహాలక్ష్మీ దేవి, 24న రాజరాజేశ్వరీదేవి, 25న ఊంజల్ దేవిగా అలంకరిస్తారు. 20న బిందె సేవ, గ్రామోత్సవం, 22న దున్నపోతు మెరవణి, 23న గుండ ప్రవేశం, 24న తొట్టి మెరవణి ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి.

వైభవంగా పవిత్రోత్సవాలు



ఆలయంలో పవిత్ర ప్రతిష్ఠ

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. తొలి రోజున పవిత్ర ప్రతిష్ఠ, వాసుదేవ ఆరాధన, కలశ స్థాపన, శాంతి హోమాలు నిర్వహించారు. రంగుల పుష్పాలతో స్వామిని అలంకరించిన అనంతరం స్నపన తిరుమంజనం గావించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు.

భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు

రాయచోటిటౌన్: రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి ఆదివారం అమావాస్య పూజలు శనివారం నిర్వహించారు. మూలవిరాట్ స్వామి, అమ్మవారికి అభిషేక పూజలు జరిపారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి పల్లకిపై మాఢవీధులలో ఊరేగించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ.రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అధికారుల చొరవ.. రైతుకు న్యాయం



రైతు బైరప్పగారి లక్ష్మీనారాయణ

పెద్దతిప్పసముద్రం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో ఓ రైతుకు సత్వరమే న్యాయం జరిగింది. మండలంలోని బొంతలవారిపల్లికి చెందిన రైతు లక్ష్మీనారాయణ మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేసి రూ.2.76 లక్షల సొమ్మును దశలవారీగా ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే ఓ వ్యక్తికి కంతుల రూపంలో చెల్లించాడు. ఆ వ్యక్తి పూర్తి మొత్తాన్ని సంస్థకు జమ చేయకుండా రూ.1.50 లక్షల సొమ్ము సొంత ప్రయోజనాలకు వాడుకున్నాడు. దీంతో ఫైనాన్స్ ప్రతినిధులు రైతును రూ.1.50 లక్షలు కంతులు ఇవ్వలేదని రైతు ట్రాక్టర్ తీసుకెళ్లారు. ఆ రైతు ఈ నెల 6న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్ ఎదుట తన గోడును వెళ్లబోసుకున్నారు. కలెక్టర్ స్పందించి ఎస్పీకి విన్నవించగా విచారించాలని ఆయన స్థానిక పోలీసులకు తెలిపారు. వెంటనే వారు ఫైనాన్స్ సిబ్బందిని పిలిపించి దస్త్రాలు పరిశీలించారు. వెంటనే రూ.3.50లక్షలు చెల్లించినట్లు ఎన్‌ఓసీ ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులను హెచ్చరించారు. ట్రాక్టర్‌ను రైతుకు అప్పగించారు.

పూచీకత్తు సమర్పించిన టీడీపీ నాయకులు



మదనపల్లె రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ నాయకులు

మదనపల్లె: అంగళ్లు దాడి ఘటనలో నిందితులైన టీడీపీ నాయకులు హైకోర్టులో కండీషన్ బెయిల్ పొంది, అన్నమయ్య జిల్లా మదనపల్లి డీఎస్పీ కార్యాలయం, రూరల్ సర్కిల్ కార్యాలయంలో బెయిల్ పూచీకత్తును శనివారం సమర్పించారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ రాజంపేట లోక్‌సభ స్థానం అభ్యర్థి గంటా నరహరి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మతో పాటు నాయకులు మధుబాబు, దొరస్వామి నాయుడు డీఎస్పీ కార్యాలయం చేరుకుని ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున జామీను, పదివేల రూపాయల పూచీకత్తు బెయిల్ పత్రాలను అందజేశారు. ముదివేడు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు(క్రైమ్ నంబరు 79/2023)లో డీఎస్పీ కేశప్ప ఎదుట హాజరై పూచీకత్తు సమర్పించారు. ఇదే ఘటనలో ఆయుధాల చట్టం కింద నమోదైన కేసు(క్రైమ్ నంబరు 74/2023)లో అమరనాథరెడ్డి, గంటా నరహరి రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో సీఐ శివాంజనేయులు ఎదుట జామీను సమర్పించారు.

ఐఓఎస్ అధికారుల తనిఖీ

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు గ్రామ పంచాయతీలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్టాండర్డ్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. రైల్వేకోడూరుకు ఐఓఎస్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ గతంలో గ్రామ పంచాయతీ అధికారులు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ఐఎస్ఓ కో-ఆర్డినేటర్ సోనియా జోష్, తదితరులు గ్రామంలో తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఐఎస్ఓ సర్టిఫికేషన్ పరిధికి లోబడి 70శాతం నిబంధనలు పాటిస్తున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. పరిసర ప్రాంతాలు పరిశీలించి అధికారులతో సమీక్షించారు.

పీలేరు రూరల్: ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) ప్రతినిధి సోనియా జోష్ అన్నారు. పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కిలా ప్రతినిధులు శనివారం సందర్శించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ముఖాముఖి నిర్వహించారు. దస్త్రాల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎల్‌పీఓ నాగరాజ, సర్పంచ్ జీనత్ పాల్గొన్నారు.

రూ. 210 కోట్లతో జీవనోపాధికి చర్యలు



డాక్టర్ విజయకుమార్

కురబలకోట : రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో రూ.210 కోట్లతో వ్యవసాయేతర రంగంలో జీవనోపాధుల కల్పనకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని చెన్నామర్రి వద్ద ఉన్న చింత పండు ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ట్రయల్ రన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయేతర రంగాల్లో సూక్ష్మ, మధ్య తరహా సంస్థల ఏర్పాటు ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. జీవనోపాధులకు రూ. 160 కోట్లు, ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) కింద రూ.50 కోట్లతో క్లస్టర్లను ఏర్పాటు చేసి తద్వారా ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా 160 రకాల వ్యవసాయేతర రంగాలను గుర్తించినట్లు తెలిపారు. టెర్రకోట, చిన్నపాటి వ్యాపారాలు, చిరుధాన్యాలు, చింతపండు ప్రాసెసింగ్, వనమూలికలు, చేతి వృత్తులు, పేపర్ ప్లేట్స్, కుటీర పరిశ్రమలు తదితర ప్రాధాన్యత రంగాలకు క్లస్టర్లు ఏర్పాటు చేసి వాటిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వెలుగు ఏపీఎం నీరజ, శ్రీనివాసులు, టెర్రకోట సంఘం నాయకులు దుర్గం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ నవోదయ కాలనీకి చెందిన ముత్యాలు కుమారుడు సత్యవేలు (42) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో సీటీఎంకు వెళ్లాడు. తిరిగి మదనపల్లెకు వస్తుండగా శానిటోరియం సమీపంలో ఎదురుగా ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ద్విచక్రవాహనంతో పాటు వెనుకనే ఉన్న ట్రాక్టర్‌ను సైతం ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్టీసీ బస్సు అతివేగంగా, నిర్లక్ష్యంగా రావడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన సత్యవేలును 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించడంతో ఓ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీకి చెందిన బాలిక (17) తల్లిదండ్రులు మందలించడంతో ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆంత్రాక్స్ లక్షణాలతో గొర్రెలు మృత్యువాత

తంబళ్లపల్లె : మండలంలోని జుంజురపెంట పంచాయతీ గంజికుంటవారిపల్లెలో ఆంత్రాక్స్ వ్యాధి లక్షణాలతో గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు దేవా, వెంకటరమణ, విశ్వనాథ్ తెలిపారు. శుక్ర, శనివారాలలో 13 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు వాపోయారు.

ద్విచక్రవాహనాలు ఢీ - ఒకరి మృతి

వాల్మీకిపురం : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని అయ్యావారిపల్లి సమీపంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని బూడిదవేడుకు చెందిన వెంకటరమణ వాల్మీకిపురంలో బేల్దారి పనికి వచ్చి తిరిగి ప్రయాణమయ్యాడు. మదనపల్లి మండలం సిద్దారెడ్డిగారిపల్లికి చెందిన అశోక్ గుండ్లూరు నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని అయ్యావారిపల్లి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటరమణ, అశోక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 సహాయంతో వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. మార్గమధ్యంలోనే వెంకటరమణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.